క్లుప్తంగా

పట్టణాభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నాం



డ్రైన్ పనులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సహకారంతో దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడం ద్వారా పట్టణాభివృద్ధి ధ్యేయంగా తమ కౌన్సిల్ పని చేస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.8.6 లక్షలతో స్థానిక 27వ వార్డులో నిర్మిస్తున్న సీసీ డ్రైన్ పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. పూర్తి నాణ్యతతో త్వరితగతిన పనులను పూర్తి చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. కౌన్సిలర్ నీలం దుర్గ, సచివాలయ సెక్రటరీ ధనకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కాలువగట్టును పటిష్ట పరచాలి

కాజులూరు: మండలంలోని తణుకువాడలో బలహీనంగా ఉన్న పంటకాలువ గట్టును పటిష్ట పరచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు వాసంశెట్టి శ్రీనివాస్, యిళ్ళ సత్యనారాయణ తదితరులు కోరారు. మంగళవారం గ్రామంలో వారు విలేకరులతో మాట్లాడుతూ శలపాక రెవిన్యూ పరిధి నుంచి తణుకువాడ వరకు పంటకాలువ ప్రవహిస్తుందన్నారు. ఈ కాలువపై లోలెవల్ పైపు దగ్గర నుంచి 4వ, నంబరు పైపు వరకు గట్టు బలహీనంగా ఉండి నీరుకట్టు సమయాల్లో తరచూ గండ్లు పడిపోతున్నాయన్నారు. దీంతో సకాలంలో పొలాలకు సాగునీరందక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. అధికారులు స్పందించి కాలువగట్టు పటిష్ట పరచేందుకు చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

భూసర్వే ప్రక్రియ వేగవంతం



వల్లూరులో సర్వేరాళ్లు అమర్చేందుకు ఏర్పాట్లు చేస్తున్న వీఆర్వో తదితరులు

కపిలేశ్వరపురం: గ్రామాల్లో భూ సర్వే ప్రక్రియను వేగవంతం చేశారు. తహసీల్దార్ కొమరం సూర్యారావు పర్యవేక్షణలో గ్రామ రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో సర్వే కొనసాగుతోంది. వల్లూరులో మంగళవారం సర్వే రాళ్ళు అమర్చే ప్రక్రియ చేపట్టారు. భూ హక్కులను పారదర్శకంగా పరిరక్షించే ప్రక్రియలో భాగంగా సర్వే చేపట్టినట్టు తహసీల్దార్ కొమరం సూర్యారావు తెలిపారు.

తాపేశ్వరంలో 'బాబుతో నేను'

మండపేట: బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మంగళవారం మండలంలోని తాపేశ్వరంలో పర్యటించారు. టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టే బోయే కార్యక్రమాల గురించి స్థానికులకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీని గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖాళీ స్థలం లీజుకు టెండర్ల ఆహ్వానం

రామచంద్రపురం రూరల్: ఏపీఎస్ ఆర్టీసీ రామచంద్రపురం డిపో పరిధిలోని మండపేట కొత్త బస్టాండ్ ఆవరణలో ఖాళీగా ఉన్న 3640 చదరపు గజాలు, 726 చదరపు గజాల ఖాళీ స్థలాలు 15 సంవత్సరాల కాల పరిమితితో లీజుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ కొడమంచిలి వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు నవంబరు 2వ తేదీ లోపుగా టెండరు షెడ్యూలు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని 3వ తేదీ మధ్యాహ్నం 2 గంటల లోపుగా విజయవాడలోని కార్యాలయంలో సమర్పించాలన్నారు. అదే రోజు టెండర్లు తెరిచి లీజుకు ఇస్తామన్నారు. బిడ్ విధానంపై అవగాహన కోసం ఈ నెల 20న రాజమహేంద్రవరం ఉదయం 10.30 గంటలకు డీపీటీఓ కార్యాలయం వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల తనిఖీ

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా డీవీఈఓ ఎస్‌వీవీ సత్యనారాయణ రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. కళాశాలలో క్వార్టర్లీ పరీక్షలు జరుగుతున్న తీరును, నాడు–నేడు పనులను పరిశీలించారు. ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు 100 రోజులు సమయం కూడా లేదని ప్రతి విద్యార్థి సమయాన్ని వృథా చేయకుండా చదివేలా, మంచి ఉత్తీర్ణత సాధించేలా చూడాలని ప్రిన్సిపాల్ గోపాలకృష్ణకు సూచించారు.

మనోజ్‌కు బెస్ట్ అడ్వొకేట్ అవార్డు

అమలాపురం టౌన్: ముంబై ఎస్‌వీకేఎం ప్రవీణ్ గాంధీ కాలేజ్ ఆఫ్ లా ఈ నెల 12వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ నిర్వహించిన నేషనల్ ట్రయల్ అడ్వకసీ–జడ్జిమెంట్ రైటింగ్ కాంపిటీషన్–2023 కార్యక్రమంలో తనకు బెస్ట్ అడ్వొకేట్ అవార్డు వచ్చిందని అమలాపురానికి చెందిన న్యాయ శాస్త్ర విద్యార్థి మాకిరెడ్డి మనోజ్ తెలిపారు. ముంబై హైకోర్టు రిటైర్డ్ జడ్జి ఉమేష్ దత్తాత్రేయ సాల్వీ చేతుల మీదుగా మెమెంటో, ప్రశంసా పత్రం, రూ.7 వేల నగదు బహుమతిగా అందుకున్నానన్నారు.

అమ్మ దయకోసం.. ఎర్ర సైన్యం

- ఎటుచూసినా భవానీ మాలధారులే
- ఘనంగా జరుగుతున్న నవరాత్ర ఉత్సవాలు
- అంతటా ఆధ్యాత్మిక శోభ



అర్తమూరు కనకదుర్గమ్మ ఆలయంలో భవానీమాలధారుల పూజలు

మండపేట: శరన్నవరాత్రుల వేళ పట్టణం, పల్లెలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఎటు చూసినా మెడలో మాల, ఎర్రని దుస్తులతో భవానీ మాలధారులే. జై భవాని నినాదాలే. తమకు అన్నీ శుభాలే కలగజేయాలని వేడుకుంటూ దీక్షాధారులై అమ్మవారి సేవలో తరిస్తున్నారు. బృందాలుగా ఏర్పడి తెల్లవారుజాము, సాయంత్ర వేళల్లో ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం తల్లి దీక్షాధారుల సంఖ్య ఏటేటా పెరుగుతోంది. సాధారణంగా విజయదశమి, డిసెంబర్‌లో నిర్వహించే చండీయాగానికి భవాని మాలలు ధరిస్తుంటారు. మండల దీక్ష చేసే వారు 41 రోజుల ముందు, అర్ధ మండల దీక్ష చేసే వారు 21 రోజుల ముందు మాల ధారణ చేస్తుంటారు. అధిక శాతం మంది భక్తులు నవరాత్ర ఉత్సవాల్లో తొమ్మిది, 11 రోజుల దీక్షలు చేస్తుంటారు. స్వల్ప వ్యవధి కావడంతో చిన్నా పెద్దా, పురుషులు, మహిళలు తేడా లేకుండా మాలలు ధరిస్తారు. అవకాశాన్ని బట్టి ఇంటిల్లిపాదీ దీక్షాధారణ చేసి అమ్మవారిని కొలుస్తారు. విజయదశమి రోజున విజయవాడ వెళ్లి కనకదుర్గమ్మ వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. అనంతరం దీక్ష విరమణ చేస్తుంటారు.

మారుమోగుతున్న ఆలయాలు

ప్రస్తుతం నవరాత్ర ఉత్సవాల నేపథ్యంలో ఎటు చూసినా భవానీ మాలధారులే కనిపిస్తున్నారు. ఎక్కడ చూసినా అమ్మవారి ఆలయాలు విద్యుత్తు దీపాలంకరణలతో ముస్తాబై మాలధారులతో కిటకిటలాడుతున్నాయి. మునుపటితో పోలిస్తే ఈ ఏడాది భవానీ మాలధారుల సంఖ్య గణనీయంగా పెరిగిందంటున్నారు. మండపేట పట్టణంలోనే రెండు వేల మందికి పైగా భవానీమాలలు ధరించినట్టు అంచనా. మండపేటలో ప్రసిద్ధి చెందిన కొండపల్లివారి దుర్గమ్మ, కలువపువ్వు సెంటర్, రైతు బజార్, సత్యశ్రీ రోడ్డులోని అమ్మవారి ఆలయాలు, అర్తమూరులోని కనకదుర్గమ్మ తల్లి ఆలయం, చినద్వారపూడి సత్తెమ్మ తల్లి ఆలయం, ఏడిదలోని దుర్గమ్మ తల్లి, తదితర ఆలయాలు తెల్లవారు జాము, సాయంత్ర వేళల్లో భక్తులతో కిక్కిరిసిపోతున్నాయి. కొందరు బృందాలుగా పీఠాలు ఏర్పాటు చేసుకుని అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్నారు. లక్షార్చన, కుంకుమార్చనలు, సామూహిక భిక్షలతో ఎక్కడికక్కడ పండగ వాతావరణం కనిపిస్తోంది.

అన్నపూర్ణదేవిగా కనకదుర్గమ్మ

రామచంద్రపురం: దసరా ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు స్థానిక పార్కు వద్ద ఉన్న కనకదుర్గ అమ్మవారు కాశీ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కొత్తూరు రోడ్డు జోడు తూముల వద్ద వేంచేసిన కనకదుర్గ అమ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులను దర్శనమిచ్చారు. ఆలయంలో మంగళవారం లలితా సంగీత శిక్షణాలయం వారిచే గరిమెళ్ళ లక్ష్మీసత్యవతి వారి శిష్య బృందం 20 మంది నవరాత్రి స్వరాంజలి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దంగేటి వీరభద్రరావు, చెరుకుపల్లి గణేష్‌శర్మ, గరిమెళ్ళ రామకృష్ణ, మరియు విద్యార్థుల తల్లిదండ్రులు భక్తులు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ద్రాక్షారామలో..

రామచంద్రపురం రూరల్: దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు దేవాలయాల్లో శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. దక్షిణ కాశీ ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో 12 వ శక్తిపీఠం మాణిక్యాంబా అమ్మవారి సన్నిధిలో లక్ష కుంకుమార్చన, సువర్ణ పుష్పార్చన తదితర పూజలు ఘనంగా జరిగాయి. మాణిక్యాంబా అమ్మవారు అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులకు అలరించారు. ద్రాక్షారామ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వారణాసి కార్తికేయ బ్రహ్మత్వంలో గాయత్రీదేవి అమ్మవారి అవతారంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారు అలరించారు. ఆదివారపుపేట శివబాలయోగి మహారాజ్ ఆశ్రమంలో పార్వతీ అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు బోండు బాల బ్రహ్మత్వంలో పూజలు నిర్వహించారు.



విశేషాలంకరణలో సోమేశ్వరంలోని బాలాత్రిపుర సుందరీ

గాయత్రీదేవిగా విజయదుర్గ అమ్మవారు

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో మంగళవారం విజయదుర్గా అమ్మవారు గాయత్రీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పీఠం అర్చకులు చీమలకొండ వీరావధాని, చీమలకొండ శ్రీనివాస్, కోట లక్ష్మీనారాయణ, నాగేంద్రశర్మ, చక్రవర్తుల మాధవాచార్యుల ఆధ్వర్యంలో విజయదుర్గా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పీఠంలో అమ్మవారి సన్నిధిలో సామూహిక కుంకుమ పూజలు చేశారు. పీఠంలో భక్తులు ఏర్పాటు చేసుకున్న కలశాలకు కూడా పూజాదికాలు నిర్వహించారు. అమ్మవారికి ఏకవార రుద్రాభిషేకం, గాయత్రీ అష్టోత్తరంతో కుంకుమ పూజలు, నవగ్రహ హోమం నిర్వహించారు. భక్తులకు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఠం పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్ (బాబి) ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.

వైభవంగా దసరా ఉత్సవాలు

మండలంలోని పలు ఆలయాల్లో మంగళవారం అమ్మవారిని గాయత్రీ రూపంలో అలంకరించి, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పలు ఆలయాల్లో అధిక సంఖ్యలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేసారు.

చారిత్రక శివాలయల్లో

మండలంలోని సోమేశ్వరం, వెంటూరులోని చారిత్రక శివాలయాలైన బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి, ఉమా సమేత సోమేశ్వరస్వామి ఆలయాల్లో అమ్మవారిని గాయత్రీదేవి రూపంలో అలంకరించారు. ఆలయ ప్రధానార్చకుడు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ అర్చకత్వంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత సోమేత సోమేశ్వరస్వామిని విశేషంగా అలంకరించారు. రాయవరంలోని పార్వతి సమేత రాజేశ్వరస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు విలపర్తి ఫణిధర్‌శర్మ, శశిధర్‌శర్మలు స్వామివారిని, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజాధికాలు నిర్వహించారు.

మాలధారులు పెరిగారు



మునుపటి కంటే ఈ ఏడాది గ్రామంలో మాలధారులు గణనీయంగా పెరిగారు. ఉదయం, సాయంత్రం వేళల్లో భవానీ మాలధారులతో ఆలయం కిటకిటలాడుతోంది. అమ్మవారి ప్రత్యేక పూజలతో గ్రామంలో ఆధ్యాత్మికత వెల్లి విరుస్తోంది.

–కర్రి సత్యనారాయణరెడ్డి (జంబయ్య), ఉప సర్పంచ్, కనకదుర్గమ్మ ఆలయ చైర్మన్, అర్తమూరు

25 ఏళ్లుగా మాలధారణ



కోరిన కోర్కెలు తీర్చే బంగారు తల్లి కనకదుర్గమ్మ వారు. 25 ఏళ్లుగా అమ్మవారి భవాని మాలధారణ చేస్తున్నాను. మాల ధారణతో మనస్సుకు ఎంతో ప్రశాంతత లభిస్తుంది. నిష్టతో దీక్ష చేసిన వారు అమ్మవారి కృపకు పాత్రులవుతారు.

–పోతుల రాంబాబు, భవానీభక్తుడు, ద్వారపూడి



అన్నపూర్ణ దేవిగా దర్శనమిచ్చిన పార్కు వద్ద ఉన్న కనకదుర్గమ్మ



గాయత్రీదేవిగా ద్రాక్షారామ కన్యకా పరమేశ్వరి అమ్మవారు



అన్నపూర్ణాదేవిగా ఆదివారపుపేట పార్వతీ అమ్మవారు



గాయత్రీ అవతారంలో వెదురుపాక విజయదుర్గా అమ్మవారు

పూర్తి వసతులతో ఆస్పత్రి నిర్మాణం

- 50 పడకలకు అప్‌గ్రేడ్ చేసేందుకు చర్యలు
- ఎంపీ బోస్, ఎమ్మెల్సీ తోట



నిర్మాణ పనులపై అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ బోస్, ఎమ్మెల్సీ తోట

మండపేట: మండపేట ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ఆధునిక వసతులతో కొత్త ఆస్పత్రిని త్వరితగతిన పూర్తిచేసి ప్రారంభించేందుకు కృషి చేస్తున్నామని ఎంపీ పిల్లి సుభాష్‌చంద్ర బోస్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు వెల్లడించారు. పెదకాలువ వంతెన సమీపంలో 6.98 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణ పనులను మంగళవారం వారు పరిశీలించారు. పనుల ప్రగతిపై అధికారులతో చర్చించారు. పూర్తి నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ఎంపీ బోస్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి ప్రజావసరాలకు చాలడం లేదని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందించి అత్యంత విలువైన 3.06 ఎకరాల స్థలాన్ని కేటాయించారన్నారు. నాబార్డు నుంచి రూ.5.48 కోట్లు, మున్సిపాలిటీ నుంచి రూ.1.5 కోట్లు మంజూరు కాగా నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. మండపేటకు వంద పడకల ఆస్పత్రి తీసుకురావాలన్న తమ లక్ష్యం కాగా దురదృష్టవశాత్తు రెవెన్యూ డివిజన్‌లో ఒక ఏరియా ఆస్పత్రి మాత్రమే ఉండాలన్న ప్రభుత్వ నిబంధన ప్రతిబంధకంగా మారిందన్నారు. అయితే జిల్లాలోనే మండపేట అతిపెద్ద మునిసిపాల్టీ కావడంతో స్థానిక అవసరాల దృష్ట్యా వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసేందుకు కృషి చేస్తున్నామని ఎంపీ బోస్ వివరించారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ సీఎం జగన్ పేదల వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన వేగుళ్ల జోగేశ్వరరావు ఆస్పత్రి అభివృద్ధికి చేసిందేమీ లేదన్నారు. ప్రస్తుత 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన కృష్ణార్జున చౌదరి అభివృద్ధి చేశారన్నారు. గతంలో ఇక్కడ నుంచి మంత్రిగా సేవలందించిన బోస్ ఆస్పత్రి మంజూరు చేయించారన్నారు. ప్రస్తుతం 30 పడకల ఆస్పత్రిని 50 పడకలకు అప్‌గ్రేడ్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తోట తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ పరిశీలకుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, రాష్ట్ర నేతలు కర్రి పాపారాయుడు, రెడ్డి రాజుబాబు, మున్సిపల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, జంగమ కార్పొరేషన్ డైరెక్టర్ మీగడ శ్రీనివాస్, కౌన్సిలర్ మెండు బాపిరాజు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే పేదల భవిష్యత్తు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- కేశవరంలో గడప గడపకూ..



కేశవరం వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: సంక్షేమ సారథి అయిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే పేదల భవిష్యత్తు ముడిపడి ఉందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. సంక్షేమ పాలనను కొనసాగించుకునేందుకు జననేతనే మరలా సీఎం చేసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన కేశవరంలో పర్యటించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, సర్పంచ్ పెదపాటి సత్యనారాయణ మూర్తి తదితరులతో కలిసి గ్రామంలోని ఆళ్ల వారి వీధి, మాదే చెరువు, మార్కెట్ రోడ్డు ప్రాంతాల్లో ఇంటింటికీ పర్యటించారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అంటూ స్థానికులను యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. స్థానికులు చెప్పిన సమస్యలపై ఎంపీడీఓ ఐ.రాజు, పంచాయతీ కార్యదర్శి సుబ్బారావులతో మాట్లాడి పరిష్కారానికి సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పాలన జరుగుతోందన్నారు. అవినీతి రహితంగా, పూర్తి పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ అందుతున్నాయని తెలిపారు. కేశవరం, మండపేట సొసైటీ చైర్మన్లు ముక్కపాటి శ్రీనివాస్, పెంకే గంగాధర్, ఆర్‌బీకే మండల కమిటీ చైర్మన్ అన్నందేవుల చంద్రరావు, ఎంపీటీసీ సభ్యులు అన్నందేవుల కృష్ణారావు, చంద్రమళ్ల పోతురాజు, పార్టీ నేతలు ఓగిరాల దేవి, పెదపాటి ఉమామహేశ్వరరావు, సూరంపూడి సత్యప్రసాద్, తుపాకుల ప్రసన్నకుమార్, అద్దంకి రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు జగనన్న కృషి



చేదువాడలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేస్తున్న వైద్యులు, నాయకులు

కాజులూరు: రాష్ట్రంలో ప్రజారోగ్య పరిరక్షణకు సీఎం జగనన్న ఎంతగానో కృషి చేస్తున్నారని ఎంపీపీ మాత భారతి అన్నారు. మంగళవారం మండలంలోని చేదువాడ గ్రామ సచివాయం ఆవరణలో అధికారులు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. దుగ్గుదుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారి వై.సుప్రియ ఆధ్వర్యంలో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన డాక్టర్లు జి.హర్షవర్ధన్, ఎస్.సాయిరామ్‌కుమార్, వై.సుప్రియ, సీపీఎల్ శ్రేయ, ఎ.సౌమ్య తదితర నిపుణులైన వైద్యులు పాల్గొని 580 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి సుప్రియ మాట్లాడుతూ గ్రామాల్లో పౌరులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి తగు చికిత్స నందించటంతో పాటు ప్రజలకు ఆరోగ్య నియమాలపై అవగాహన కల్పించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంజా దేవి, మాత మురళి, గంజా సూరిబాబు, మాజీ సర్పంచ్ యాళ్ల శ్రీనివాస్, సచివాలయాల సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జగనన్నకు మద్దతుగా నిలవండి

- మంత్రి వేణు
- కూళ్లలో గడపగడపకూ..



కూళ్లలో మహిళకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న మంత్రి వేణు

కె.గంగవరం: తన సంక్షేమ పాలనతో ప్రతి కుటుంబానికి మేలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలవాలని మండలంలోని కూళ్ల గ్రామ ప్రజలను రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ కోరారు. గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి వేణు పాల్గొన్నారు. గ్రామస్తులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన మంచిని వివరిస్తూ.. సమస్యలు ఉంటే తెలుసుకుని పరిష్కారం కోసం అధికారులను ఆదేశిస్తూ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ చిల్లే నాగేశ్వరరావు, ఎంపీటీసీ పిల్లి దుర్గాప్రసాద్, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాసరావు, మండల సచివాలయ కన్వీనర్ తోకల శ్రీను, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పేదలకు వరం ఆరోగ్య సురక్ష

- వైఎస్సార్ సీపీ యువ నేత పృథ్వీరాజ్, జెడ్పీటీసీ సభ్యురాలు మంగతాయారు
- పలు గ్రామాల్లో సురక్ష వైద్య శిబిరాలు



పసలపూడి శిబిరంలో రోగులకు మందులు అందజేస్తున్న పృథ్వీరాజ్ తదితరులు



ఏడిదలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య సేవలు



వల్లూరులో గర్భిణులకు సీమంతం చేస్తున్న ప్రజాప్రతినిధులు



అద్దంపల్లి సురక్షలో మాట్లాడుతున్న నరేన్



ఓదూరులో వైద్య సేవలు పొందుతున్న గ్రామస్తులు

రాయవరం: పేదలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఒక వరం వంటిదని వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్, జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు అన్నారు. పసలపూడిలో సర్పంచ్ కడలి పద్మావతి అధ్యక్షతన మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్, మంగతాయారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరంలో 515 మందికి వైద్య బృందం పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఉప సర్పంచ్ పోతంశెట్టి సాయిరామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు చింతా సుబ్బారెడ్డి, పార్టీ నేతలు పోతంశెట్టి సత్తిబాబు, మల్లిడి రామారెడ్డి, ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

ఏడిదలో 370 మందికి..

మండపేట: వివిధ రకాల వ్యాధులు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న పేదలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు అన్నారు. మండలంలోని ఏడిద జెడ్పీ ఉన్నత పాఠశాల్లో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో 370 మంది రోగులకు వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులను అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు చేసి పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఎంపీడీఓ ఐ.రాజు, ఈఓ వుండమట్ల వీర్రాజులు శిబిరం వద్ద అవసరమైన ఏర్పాట్లు చేశారు. వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, సొసైటీ చైర్మన్ రామిశెట్టి శ్రీహరిబాబు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్, ఆర్‌బీకే మండల డైరెక్టర్ చిలుకూరి బుజ్జి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వల్లూరులో 650 మందికి..

కపిలేశ్వరపురం: వల్లూరులో నిర్వహించిన సురక్ష వైద్య శిబిరంలో వివిధ ఆరోగ్య సమస్యలకు సంబంధించి 650 మందికి పరీక్షలు చేశారు. అచ్యుతాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి కరుణేంద్రకుమారి పర్యవేక్షణలో పలు ఆసుపత్రుల నుంచి వచ్చిన వైద్య నిపుణులు విజయదుర్గ, హర్షతునీషా శిబిరంలో వైద్య సేవలందించారు. సర్పంచ్ దాసి మీనాకుమారి, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావు సేవలను పర్యవేక్షించారు. 348 మంది మహిళలు, 302 మంది పురుషులకు పరీక్షలు చేశారు. చిన్నారుల సమస్యలపై ముగ్గురికి , కంటికి సంబంధించి 138 మందిని పరీక్షించారు. 26 మంది వృద్ధులు, చిన్నారులకు కళ్ళజోళ్ళను ఉచితంగా ఇచ్చేందుకు నిర్ణయించారు. శిబిరాన్ని జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి సందర్శించారు. ఐసీడీఎస్ సీడీపీఓ అధికారి గజలక్ష్మి పర్యవేక్షణలో అంగన్‌వాడీల ఆధ్వర్యంలో పౌష్టికాహార పదార్థాలను ప్రదర్శించారు. గర్భిణులకు సీమంతం చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ సీహెచ్.గోపాలకృష్ణ, ఎంపీహెచ్ఎస్ శ్రీధర్, పీఏసీఎస్ చైర్మన్ ఎం.సతీష్, వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షులు చేంబ్రోలు వీరభద్రరావు, ఆరోగ్య, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

అద్దంపల్లిలో..

కె.గంగవరం: రాష్ట్ర ప్రజలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంటి రెప్పలుగా కాపాడుతున్నారని మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తనయుడు, యువనేత నరేన్ అన్నారు. మండలంలోని అద్దంపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్షలో నరేన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రామస్తులకు వైద్య శిబిరంలో వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చింతపల్లి లక్ష్మి, ఎంపీపీ పంపన నాగమణి, వైస్ ఎంపీపీలు దూడల నాగేశ్వరరావు, నీతిపూడి మధుబాల, నాయకులు చింతపల్లి వాసు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఓదూరులో..

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఓదూరులో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 429 మంది గ్రామస్తులకు వైద్య సేవలు అందించారు. సర్పంచ్ వింజుమల్ల విమలకుమారి, ఎంపీటీసీ పరమటి జ్ఞానలక్ష్మిలు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు ఆదినారాయణ, లిఖియ, ప్రతాప్, ఆనంద్, కంటి వైద్య నిపుణుడు ధర్మవరపు కోటేశ్వరరావులు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ కొండేపూడి ప్రసన్న, ఎంపీడీఓ ఎస్.కీర్తి స్పందన, ఈఓపీఆర్డీ ఎస్.షలత్‌రాజు, పంచాయతీ కార్యదర్శి కేవీ శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.